విశ్వంభర V3 NEWS

# పవన్ కల్యాణ్‌కు ఆర్ నారాయణ మూర్తి మద్దతు!




సీనియర్ నటుడు, నిర్మాత ఆర్. నారాయణమూర్తి సినీ పరిశ్రమలోని ప్రస్తుత పరిణామాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన.... "ప్రభుత్వాన్ని సినీ పెద్దలు కలవాలి" అన్న వ్యాఖ్యలను ఆయన సమర్థించారు. "ప్రభుత్వాన్ని సినీ పెద్దలు కలవాలి అని పవన్ కల్యాణ్ అనడంలో తప్పులేదు" అని ఆయన అన్నారు. అయితే, తన సినిమా 'హరిహర వీరమల్లు' ప్రస్తావన లేకుండా, కేవలం పరిశ్రమలోని సమస్యలపై చర్చించడానికి పవన్ పిలుపునిచ్చి ఉంటే ఆయనపై మరింత గౌరవం పెరిగేదని నారాయణమూర్తి వ్యాఖ్యానించారు. జూన్ 1 నుంచి 'హరిహర వీరమల్లు' కోసమే థియేటర్లు బంద్ చేస్తున్నారనే ప్రచారాన్ని ఆయన ఖండించారు. అది పూర్తిగా అబద్ధమని స్పష్టం చేశారు. గద్దర్ అవార్డులను ప్రకటించడం గర్వంగా ఉందని, విజేతలకు అభినందనలు తెలిపారు. అలాగే, ఏపీలో ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా నంది అవార్డులను ప్రకటించాలని ఆయన కోరారు.

సినిమా రంగంలో పర్సంటేజీల వివాదంపై నారాయణమూర్తి తీవ్రంగా స్పందించారు. "పర్సంటేజీ విధానాన్ని కోరుకునే వ్యక్తుల్లో నేనూ ఒకడిని. ఈ విషయంలో ఛాంబర్ ముందు టెంటు వేసి ఆందోళనలు చేశాం. ఎంతోమంది ఛాంబర్ ప్రెసిడెంట్‌లకు విజ్ఞప్తి చేసినా సమస్య పరిష్కారం కాలేదు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పర్సంటేజీ ఖరారైతే తనలాంటి చిన్న నిర్మాతలకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. పర్సంటేజీ విషయం ఒక కొలిక్కి వచ్చే దశలో దానికి 'హరిహర వీరమల్లు' సినిమాకు లింకు పెట్టడం సరికాదని హితవు పలికారు. "బంద్ అనేది బ్రహ్మాస్త్రం. నేటి రోజుల్లో సింగిల్ థియేటర్ల మనుగడ ప్రశ్నార్థకరమైంది. కార్పొరేట్ సిస్టమ్‌లకు వంత పాడుతున్నారు. మరి సింగిల్ స్క్రీన్ థియేటర్లు ఏమైపోవాలి? సింగిల్ థియేటర్లు దేవాలయాల్లాంటివి. అవి ఇప్పుడు కళ్యాణమండపాలుగా మారుతున్నాయి. పర్సంటేజీని బతికించి నిర్మాతలను కాపాడాలి" అని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రేక్షకులు ఓటీటీలో సినిమాలు చూస్తే ఇండస్ట్రీ నాశనమవుతుందని కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సినిమా టికెట్ ధరల పెంపు విషయంలో ప్రేక్షకులు, సినీ పరిశ్రమ తీవ్రంగా నష్టపోతున్నాయని నారాయణమూర్తి అన్నారు. "వినోదం ఖరీదుగా మారింది. భారీ ఖర్చుతో సినిమాలు తీయడం సబబే, కానీ ఆ ఖర్చును ప్రజలపై రుద్ద వద్దు" అని ఆయన సూచించారు. హాలీవుడ్‌లో వందల కోట్లతో సినిమాలు తీస్తున్నారని, మన దగ్గర 'షోలే', 'మొఘల్ ఏ ఆజాం' లాంటి గొప్ప చిత్రాలు వచ్చాయని, వాటికోసం ధరలు పెంచలేదని గుర్తుచేశారు. "మన తెలుగులో ఐదేళ్లు 'లవకుశ' తీశారు.. ఆ సినిమాకు టికెట్ ధరలు పెంచమని అడగలేదు. సినిమా బాగుంటే జనాలు వస్తారు. టికెట్ ధరలు పెంచడం వల్ల అభిమానులే వాళ్ల హీరోల సినిమాలు చూడటం లేదు" అని నారాయణమూర్తి తన అభిప్రాయాన్ని స్పష్టం చేశారు. ఈ సమస్యలను పక్కదారి పట్టించవద్దని, పరిశ్రమ పెద్దలు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి పరిష్కరించుకోవాలని సూచించారు.



# ఏదీ శాశ్వతం కాదు..

## ఇతరుల కోసం బ్రతకొద్దు : రష్మిక


ప్రముఖ నటి రష్మిక మందన్న జీవితం, కెరీర్ ఒడిదుడుకులపై తనదైన శైలిలో స్పందించారు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, జీవితంలో ఏదీ శాశ్వతం కాదనే సత్యాన్ని గ్రహించాలని,మనం ఎప్పుడూ కూడా ఇతరుల కోసం కాకుండా మనకోసం, మన ఆనందం కోసం బ్రతకడం నేర్చుకోవాలని ఆమె పేర్కొన్నారు. తన తాజా చిత్రం 'సికందర్' ఆశించినంతగా ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయిన నేపథ్యంలో, ఆమె ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. అంతకుముందు ఆమె నటించిన 'ఛావా' చిత్రం మంచి విజయాన్ని సాధించిన సంగతి తెలిసిందే.

ఈ సందర్భంగా రష్మిక మాట్లాడుతూ, "జీవితంలో ఏదీ శాశ్వతం కాదనే విషయం నాకు బాగా తెలుసు. గతంలో కూడా చాలాసార్లు ఈ అంశం గురించి మాట్లాడాను. ఒకరోజు మనకు అనుకూలంగా ఉంటే, మరుసటి రోజే పరిస్థితి మారిపోవచ్చు. ఇలాంటి సమయాల్లో నా కుటుంబం, స్నేహితుల నుంచి లభించే మద్దతు నా అదృష్టం. ఎలాంటి ఒడిదుడుకులనైనా ఎదుర్కోవడంలో వారు నాకు అండగా నిలుస్తారు" అని తెలిపారు.

తాను అనుకోకుండానే నటనారంగంలోకి వచ్చానని రష్మిక గుర్తుచేసుకున్నారు. "నిజం చెప్పాలంటే, నటిని అవుతానని నేనెప్పుడూ ఊహించలేదు. ఈ రంగంలోకి రావడానికి ప్రత్యేకంగా ప్రణాళికలేమీ వేసుకోలేదు. ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే, నేనెంత అదృష్టవంతురాలినో అర్థమవుతోంది" అని ఆమె వివరించారు.

కెరీర్ విషయంలో స్థిరంగా ఉండాలని, మనసుకు నచ్చిన పని చేయాలని తాను అందరికీ సలహా ఇస్తానని రష్మిక చెప్పారు. "కూర్గ్ లాంటి ఒక చిన్న పట్టణంలో పుట్టిన నేను, ఈరోజు ఈ స్థాయిలో ఉన్నానంటే అందుకు కారణం అదే. వచ్చిన ప్రతి అవకాశాన్నీ సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగాలి. ఈ ప్రయాణంలో ఎదురయ్యేవి కఠినమైన పాఠాలు కావు, అన్నీ విలువైన అనుభవాలే. ఎల్లప్పుడూ ఉత్తమంగా ఉండేందుకు ప్రయత్నించండి. మనం ఎప్పుడూ కూడా ఇతరుల కోసం కాకుండా మనకోసం, మన ఆనందం కోసం బ్రతకడం నేర్చుకోవాలి. ఇతరులను సంతోషపెట్టాలనే భారాన్ని మాత్రం మోయకండి. మీ ఆనందంపై దృష్టి సారించండి" అంటూ రష్మిక యువతకు స్ఫూర్తిదాయకమైన సలహాలు ఇచ్చారు.

# పెళ్లి తర్వాత శోభిత మొదటి బర్త్ డే..



శనివారం (మే 31) శోభిత తన 33వ పుట్టినరోజు వేడుకలను జరుపుకుంటున్న నేపథ్యంలో భార్య బర్త్ డే కి నాగ చైతన్య సోషల్ మీడియాలో స్పెషల్ పోస్ట్ పెట్టాడు. నాగ చైతన్య - శోభితతో కలిసి ఉన్న ఫోటోను షేర్ చేశాడు. హ్యాపీ బర్త్ డే మై లేడీ అంటూ భార్యకు స్వీట్‌గా బర్త్ డే విషెస్ తెలియజేసాడు చైతు. ఆ ఫోటోలో నాగ చైతన్య హ్యాండ్సమ్ లుక్‌తో మతి పోగొట్టాడు. నాగ చైతన్య సెల్ఫీ తీస్తూ ఉండగా, శోభిత ఆయన భుజం పై తల పెట్టుకుని ఉంది. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట్లో చక్కర్లు కొడుతోంది. నాగచైతన్య శోభిత వివాహం జరిగిన తర్వాత వచ్చిన మొదటి పుట్టినరోజు కావడంతో ఈ పుట్టినరోజు వేడుకలను ఎంతో ప్రత్యేకంగా జరుపుకుంటున్నారని తెలుస్తోంది. అయితే ఈ పుట్టినరోజు వేడుకలను జరుపుకోవడం కోసం ఈ జంట విదేశాలకు వెళ్లినట్టు సమాచారం. ప్రస్తుతం ఈ సెల్ఫీని మోస్ట్ రొమాంటిక్ సెల్ఫీ అంటూ అభిమానులు సోషల్ మీడియాలో కామెంట్ చేస్తున్నారు. ఇక శోభిత బర్త్ డే అని తెలిసి అక్కినేని అభిమానులు, పలువురు సినీ ప్రముఖులు కూడా శోభితకి పుట్టిన రోజు విషెస్ చెబుతున్నారు. గతంలో శోభిత పలు సినిమాలు, వెబ్ సిరీస్‌లు చేసి అదరగొట్టింది. అయితే పెళ్లి తర్వాత కాస్త స్లో అయింది. ఇక శోభిత వచ్చిన వేళా విశేషం ఏంటో కాని నాగ చైతన్య తండేల్ రూపంలో పెద్ద హిట్ కొట్టాడు. ఈ చిత్రం చైతన్య కెరియర్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. కాగా, సమంతతో విడిపోయిన తర్వాత కొన్నాళ్ల వరకు నాగ చైతన్య సోలోగానే జీవితాన్ని గడిపాడు. అయితే ఆ సమయంలోనే శోభితతో పరిచయం ఏర్పడింది. నాగ చైతన్య తనను ఫాలో అవుతున్నాడు అని తెలిసి ఆశ్చర్యపోయిన శోభిత తిరిగి ఫాలో అవ్వడం మొదలు పెట్టింది. ఇద్దరి మధ్య చాటింగ్ మొదలై, ఆ తర్వాత మీటింగ్స్ వరకు వెళ్లింది.ఒకరి భావాలు ఒకరికి నచ్చడంతో పెళ్లి చేసుకోవాలని డిసైడ్ అయి డిసెంబర్ 4వ తేదీ అన్నపూర్ణ స్టూడియోలో ఎంతో ఘనంగా వివాహం జరుపుకున్నారు.. వీరి వివాహానికి అతి కొద్ది మంది స్నేహితులు, కుటుంబ సభ్యులు, సినీ సెలబ్రిటీలు హాజరై సందడి చేశారు.

# డైరెక్టర్‌తో సమంత డేటింగ్..

టాలీవుడ్ హీరోయిన్ సమంత ఇటీవలే నిర్మాతగా గ్రాండ్ ఎంట్రీ ఇచ్చింది. తన సొంత బ్యానర్‌లో శుభం అనే మూవీని నిర్మించింది. ఇటీవల థియేటర్లలో విడుదలైన ఈ సినిమాకు ఆడియన్స్ నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వచ్చింది. సినిమా సక్సెస్ కావడంతో సమంత సెలబ్రేట్ చేసుకుంది. ఆ సమయంలో తన జర్నీని గుర్తు చేసుకుంటూ ఎమోషనలైంది.

అయితే గత కొద్దికాలంగా హీరోయిన్ సమంతపై డేటింగ్ వార్తలొస్తున్న సంగతి తెలిసిందే. బాలీవుడ్ డైరెక్టర్ రాజ్ నిడిమోరుతో పలుసార్లు జంటగా కనిపించడంతో ఈ రూమర్స్ మొదలయ్యాయి. అంతేకాకుండా ఇటీవల విమానంలో రాజ్ నిడిమోరుతో క్లోజ్‌గా ఉన్న ఫోటో వైరల్ కావడంతో మరోసారి చర్చ మొదలైంది. ఇవీ చూసిన నెటిజన్స్ వీరిద్దరు డేటింగ్‌లో ఉన్నది నిజమేనా? అనే డైలామాలో పడ్డారు. అయితే ఇప్పటి వరకు ఎవరూ కూడా ఈ వార్తలపై స్పందించలేదు.

తాజాగా సమంత డేటింగ్‌పై చర్చ మొదలైంది. ఆమె సోషల్ మీడియాలో షేర్ చేసిన వీడియోను దీనికి కారణం. హ్యాపీ వీకెండ్ అంటూ జిమ్‌లో వర్కవుట్స్ చేస్తున్న వీడియోలతో పాటు ఫోటోలు కూడా పంచుకుంది. వీటిలో రాజ్ నిడిమోరుతో కలిసి సామ్ పికిల్ బాల్ ఆడుతూ కనిపించింది. కోర్టులో ఇద్దరు పికిల్ బాల్ ఆడుతూ సందడి చేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో వీరిపై నెట్టింట మరోసారి చర్చ మొదలైంది. శుభం మూవీ విడుదలకు ముందు ఇద్దరు కలిసి తిరుమల తిరుపతి ఆలయాన్ని సందర్శించిన సంగతి తెలిసిందే.

కాగా.. సమంత, రాజ్ నిడిమోరు 'ది ఫ్యామిలీ మ్యాన్ 2', 'సిటాడెల్: హనీ బన్నీ' వెబ్ సిరీసుల్లో కలిసి పనిచేశారు. ప్రస్తుతం వీరిద్దరు 'రక్త బ్రహ్మాండ్: ది బ్లడీ కింగ్‌డమ్' అనే చిత్రానికి పనిచేస్తున్నారు. ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల కానుంది.




# శేఖర్ కమ్ములని అభినందించిన మెగాస్టార్



ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల మెగాస్టార్ చిరంజీవిని కలిశారు. ఈ ప్రత్యేక సందర్భానికి సంబంధించిన ఫొటోలను, తన అనుభవాలను సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకున్నారు. సినీ పరిశ్రమలో అడుగు పెట్టి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా '25 ఇయర్స్ అఫ్ శేఖర్ కమ్ముల' సెలబ్రేటింగ్ ది సోల్ అఫ్ స్టోరీ టెల్లింగ్ పోస్టర్ ని మెగాస్టార్ చిరంజీవి లాంచ్ చేసి శేఖర్ కమ్ములని అభినందించారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఈ క్షణాలు తనకెంతో ప్రత్యేకమని శేఖర్ కమ్ముల పేర్కొన్నారు. చిరంజీవిపై తనకున్న అభిమానాన్ని, ఆయన్ని తొలిసారి చూసినప్పటి జ్ఞాపకాలను శేఖర్ కమ్ముల గుర్తు చేసుకున్నారు.

"నేను టీనేజీలో ఉన్నప్పుడు మెగాస్టార్ చిరంజీవిని ఒకసారి దగ్గర నుంచి చూశాను. అప్పుడే, 'ఈయనతో సినిమా చేయాలి' అనే బలమైన కోరిక నాలో కలిగింది. ఇప్పుడు నేను ఇండస్ట్రీలోకి అడుగు పెట్టి 25 ఏళ్లు పూర్తవుతోంది. ఈ సందర్భంగా మా బృందం ఒక వేడుక చేద్దామనుకోగానే నాకు వెంటనే గుర్తొచ్చిన వ్యక్తి చిరంజీవి గారే. కొన్ని తరాలకు స్ఫూర్తినిచ్చిన గొప్ప వ్యక్తి ఆయన. కలలను నమ్మి, వాటిని వెంబడిస్తే విజయం తప్పకుండా వరిస్తుందనే నమ్మకాన్ని కలిగించిన మహోన్నత వ్యక్తి ఆయన. నా ఈ 25 ఏళ్ల సినీ ప్రయాణాన్ని ఆయన సమక్షంలోనే జరుపుకోవాలనిపించింది. ఈ క్షణంలోనే కాదు.. నా టీనేజీ రోజుల నుంచి చిరంజీవి నా కళ్ల ముందు ఇలాగే ఉన్నారు" అంటూ శేఖర్ కమ్ముల తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. చిరంజీవితో కలిసి దిగిన ఫొటోలను కూడా ఆయన అభిమానులతో పంచుకున్నారు.




# కమల్ హాసన్‌తో లిప్ లాక్.. నా ఇష్టంతోనే చేశాను

'థగ్ లైఫ్' సినిమా ట్రైలర్ విడుదల తర్వాత మూడు సెకన్ల సీన్‌పై పెద్ద చర్చే జరిగింది. 70 ఏళ్ల కమల్ హాసన్, 42 ఏళ్ల అభిరామి మధ్య లిప్ లాక్ సన్నివేశాలు ట్రైలర్‌లో కనిపించడంతో చాలా విమర్శలకు దారితీశాయి. ఈ నేపథ్యంలో, జాతీయ వార్తా మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో నటి అభిరామి తొలిసారి మాట్లాడింది. ట్రైలర్‌లోని సన్నివేశం కేవలం మూడు సెకన్ల నిడివి మాత్రమే ఉందని, దాని గురించి ఇంత వివాదం సృష్టించడం అనవసరమని నటి అభిరామి పేర్కొంది. థగ్ లైఫ్ ప్రమోషన్స్‌లతో బిజీగా ఉన్న అభిరామి ఆ సీన్ గురించి ఇలా చెప్పింది. 'ఈ రోజుల్లో ఏదైనా క్షణాల్లోనే వివాదంగా మారవచ్చు. మనం దాని నుంచి తప్పించుకోలేము. దర్శకులు మణిరత్నం సార్ నన్ను ఆ పాత్రకు ఎందుకు ఎంచుకున్నారో నేను ఆయన్ను ప్రశ్నించను. సినిమా విషయంలో వారి నిర్ణయం ఏదైనా సరే నేను దానిని అంగీకరిస్తున్నాను. పూర్తి నా ఇష్టంతోనే ఆ సీన్ తీశారు. ఇది కేవలం మూడు సెకన్ల దృశ్యం.

కానీ, ట్రైలర్ వల్ల కొన్ని అపార్థాలు ఏర్పడ్డాయి. సినిమాలోని ఆ సన్నివేశంతోనూ, లిప్‌లాక్‌కు దారితీసే విషయాలతోనూ చాలా లింక్ ఉంటుంది. మూవీ చూసిన తర్వాత ఎవరూ అలాంటి కామెంట్లు చేయరని అనుకుంటున్నాను. అది ఆ సన్నివేశానికి బాగా సరిపోతుందనే చేశాం. దాని గురించి పెద్దగా మాట్లాడాల్సిన అవసరం లేదని నేను అనుకుంటున్నాను. అయినప్పటికీ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే.. వారు ముందు సినిమా చూడాలని నేను అభ్యర్థిస్తున్నాను' అని అభిరామి అన్నారు. కమల్ హాసన్‌మణిరత్నం కాంబినేషన్ లో రూపొందుతున్న 'థగ్ లైఫ్' సినిమా ట్రైలర్ ఇటీవలే విడుదలైంది. ట్రైలర్ మొత్తం యాక్షన్ సన్నివేశాలతో నిండి ఉంది. ఈ చిత్రంలో శింబు, జోజు జార్జ్, త్రిష, అభిరామి, ఐశ్వర్య లక్ష్మి, నాసర్, అశోక్ సెల్వన్,అలీ ఫజల్, పంకజ్ త్రిపాఠి తదితరులు నటించారు. ఈ చిత్రాన్ని రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్, రెడ్ జెయింట్ మూవీస్, ఆర్ మహేంద్రన్, శివ అనంత్ నిర్మించారు.కమల్ హాసన్, మణిరత్నం 37 ఏళ్ల తర్వాత కలిసి నటిస్తున్న ఈ చిత్రం జూన్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

రిపోర్టర్లు కావలెను
V3 NEWS
"విశ్వంభర"
తెలుగు దిన పత్రిక
VISHVAMBHARA TV
ప్రముఖ టీవీ ఛానల్స్, తెలుగు దినపత్రికల్లో
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాలు, మండలాల వారిగా
రిపోర్టర్లు, కెమెరామెన్స్, సబ్-ఎడిటర్లు, కెమెరామెన్స్,
PCR ఆపరేటర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్
పని చేయుటకు అనుభవం, ఆసక్తి గలవారు కావలెను.
సంప్రదించవలసిన చిరునామా
ఫ్లాట్ నెం. 204, 2వ అంతస్తు, బాదం కాంప్లెక్స్,
మెట్రో పిల్లర్ నెం. 1560 ఎదురుగా, చైతన్యపురి x రోడ్స్,
దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500 060, తెలంగాణ.
సెల్: 9441222429, 8885402108

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com